17

# శ్రీ శేషుదేవులు నాస్తికులను ఆస్తికులుగా మార్చేవారు.

అలాగే ఆయన స్నేహితులలో సూర్యం అనే స్నేహితుడు దేవుడు లేడు అంటూ నాస్థికుడి గానే ఉండేవాడు. శ్రీ శేషుబాబు గారు అతనితో దేవుడు ఉన్నాడో లేదో నాకు తెలియదు. అయితే లోకంలో చెడుపనులు చేసేవారు, అక్రమంగా సంపాదించేవారు, బలహీనులపై దౌర్జన్యం చేసే వారు, లంచాలు తీసుకునేవారు, కామ విషయంలో వావి-వరసలు లేనివారు, స్త్రీల అనుమతి లేకుండా బలాత్కారాలు చేసేవారు, అసూయ, ద్వేషం, అహంకారం, స్వార్థం, అందంపిచ్చి, కుటుంబపిచ్చి, బంధుపిచ్చి, కులపిచ్చి, మతపిచ్చి మొదలగు దుర్గుణములు కలిగినవారు శాంతిగాను, సుఖంగాను జీవించ లేకపోతున్నారు. అనారోగ్యాలకు, దారిద్ర్యానికి, దురదృష్టానికి గురి అవుతున్నారు. ఒకవేళ వాళ్ళు బాగున్నా కూడా వారి భార్యాబిడ్డలు సక్రమమైన, ఆరోగ్యవంతమైన జీవితం గడపడం లేదు. వారి దుస్థితిచూచి వీళ్ళు కూడా అశాంతికి, దుఃఖానికి గురి అవుతున్నారు. అయితే పైకి వాళ్ళు ఆడంబరముగా కనిపించవచ్చును కానీ వారి ఆంతరంగిక జీవితం అశాంతితోను, దుఃఖముతోను నిండిపోయి ఉంటుంది. అలాగే లోకంలో నీతిగా ఉండేవారు, మానవత్వం కలిగినవారు, ధర్మబద్ధమైన జీవితం గడిపేవారు, పేదలంటే అభిమానం, మతరహితమైన దైవభక్తి కలిగి సదాచారంగా జీవించేవారు పైకి ఆడంబరముగా కనిపించక పోయినాగానీ వారి ఆంతరిక జీవితం శాంతిగా సుఖంగా ఉంటున్నది. వారి భార్యాబిడ్డలు కూడా సక్రమమైన పద్ధతిలో జీవిస్తూ శాంతిగా సుఖంగా ఉంటున్నారు. అని చెబుతూ దానికి ఉదాహరణగా తమచుట్టూ ఉండే వ్యక్తులను, పరిస్థితులను చూపిస్తూ అయనకు అర్థమయ్యేలా చెప్పేవారు. వీటినిబట్టి మనకు అర్థమవుతున్నది ఏమిటంటే ఈ మానవ సమాజాన్ని వారి వారి మంచి-చెడు కర్మలను బట్టి పరిపాలించే ఒక మానవాతీత శక్తి ఉందని, అది పక్షపాతం లేకుండా అందరికీ వారి మంచి పనులకు శాంతి, సుఖం, చెడ్డపనులకు అశాంతి, దుఃఖము కలిగించి అందరిని నడిపిస్తున్నదని అర్థం అవుతుంది. నాస్థికులైన కమ్యూనిష్టులు కూడా ఈ సత్యాన్ని అంగీకరిస్తున్నారు. అలాగే దేవుడు లేడనుకుంటే మనిషికి పాపభీతి ఉండదు తన స్వార్థం కోసం ఎంత పాపం చేసేయడానికైనా సిద్ధపడతాడు. అయితే మనం తప్పు చేస్తే మనల్ని శిక్షించే దేవుడనేవాడు ఒకడు ఉన్నాడు అనుకుంటే, అప్పుడు పాపభీతితో తప్పులు చేయము. కాబట్టి దేవుడు ఉన్నాడా ? లేడా ? అనే విషయాన్ని పక్కన పెడితే ఉన్నాడు అనుకోవడం ద్వారా మనకి, మానవ సమాజానికి మేలు జరుగుతుంది అని చెబుతూ ఆయనకు అనేక సంఘటనలు ఉదాహరణగా చూపిస్తూ అర్థమయ్యేలా బోధించేవారు. ఇలా కొంతకాలం శ్రీ శేషుబాబు గారి దగ్గర విన్నాకా సూర్యం అనే స్నేహితుడు నాస్థికత్వ భావాలు వదిలివేసి, సర్వ సృష్టిని ప్రేమించే, పరిపాలించే దేవుడు ఉన్నాడని, ఆ దేవుని యొక్క ప్రతి రూపాలైన శ్రీ యేసుక్రీస్తు, శ్రీరాముడు ఒక్కరేనని గ్రహించి నమస్కరించేవారు. ఆ విధంగా నాస్థికులను ఆస్థికులుగా మార్చేవారు. అయితే నాస్థికులే అయినప్పటికీ పేదప్రజలంటే అభిమానం కలిగి, మతరహితంగా పేదలకు, కష్టాలలో ఉన్నవారికి, అవసరం ఉన్నవారికి సేవచేసేవాళ్ళను వాళ్ళు నాస్థికులే అయినా కూడా ఆస్థికులుగానే భావించేవారు.

******